www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 26 జులై 2025

5

కాకినాడ



28 నుంచి ఎంపిడిఒలకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎంపిడిఒలుగా ప్రమోషన్ పొందిన వారికి సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 28 నుంచి నెల రోజుల పాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపల్ కెవిఎన్.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి తొలి బ్యాచ్‌లో 46 మందికి శిక్షణ పూర్తయ్యాక రెండో బ్యాచ్‌లో 43 మందికి శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీ విస్తరణాధికారులు, పరిపాలన అధికారులుగా పనిచేసిన వీరంతా ఇటీవల ఎంపిడిఒలుగా ప్రమోషన్ పొందారని తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాలు, గ్రామ పంచాయతీ, మండల పరిషత్ పరిపాలన, అభివృద్ధి సంక్షేమ పథకాలపై సమగ్ర శిక్షణ తరగతులు రూపొందించామన్నారు.

అరకొరగా 'పొలం పిలుస్తోంది'

- పూర్తిస్థాయిలో హాజరు కాని అధికారులు
- స్థానిక ప్రజాప్రతినిధుల డుమ్మా
- అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

వ్యవసాయశాఖ ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో జిల్లాలో సాగు లక్ష్యాన్ని నిర్దేశించడంతో పాటు ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగవుతాయి, వాటికి రాయితీపై ఎన్ని విత్తనాలు అందించాలి, ఎరువులు ఎంత అవసరం ఇలా అన్నివిధాలుగా ప్రణాళిక సిద్ధం చేయడంతోపాటు రైతులకు సాగులో మెళకువలను తెలియజేయడం కోసం 'పొలం పిలుస్తోంది' పేరుతో పొలం బడుల నిర్వహణకు లక్ష్యాన్ని నిర్దేశించి ఆ దిశగా కార్యాచరణను అమలు చేస్తున్నారు. సీజన్ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ ప్రతి మంగళ, బుధవారాల్లో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది జిల్లాలో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో వరి, మరో దాదాపు 30 వేల ఎకరాల్లో వివిధ ఖరీఫ్ పంటలను రైతులు సాగు చేయనున్నారు. రైతులకు ఆరోగ్యకరమైన పంటలను పండించే విధంగా వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ద్వారా అవగాహన కల్పిస్తారు. ప్రతి సీజన్‌లో విత్తనాలు వేసినప్పటి నుంచి పంట కోసి చేతికి అందే వరకూ రైతులకు సమగ్రమైన సూచనలు, సలహాలు ఇస్తారు. తద్వారా పంటలు నష్టపోకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఎలుకల బెడద, తెగుళ్ల నుంచి పంటను ఏ విధంగా సంరక్షించుకోవాలో వివరిస్తారు. 14 వారాలపాటు 25 ఎకరాలకు ఒక పొలం బడి ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో 30 మంది రైతులకు సమాచారం తెలియజేస్తారు. ఇక్కడ తెలుసుకున్న రైతులు మిగిలిన వారికి ఆయా అంశాలను వివరిస్తారు.




పిఠాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అరకొర సిబ్బంది

అధిక దిగుబడులను సాధించడం, సస్యరక్షణ, మేలైన సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సేంద్రియ ఎరువుల తయారీ విధానం వంటి అనేక అంశాలపై అవగాహన ఈ కార్యక్రమం ద్వారా కల్పిస్తారు. ఇది మొక్కుబడి తంతుగా మారిందని విమర్శలు రైతుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడానికి జరుగుతున్న ఈ కార్యక్రమానికి రైతుల నుంచి స్పందన కరువైంది. వారికి సమాచారం ఇవ్వడంలో వ్యవసాయ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం అనేక చోట్ల కనిపించడం లేదు. కొన్ని చోట్ల వస్తున్నప్పటికీ వారు వెంటనే ఫోటోలు దిగి వెనుదిరుగుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. వ్యవసాయ శాఖ దాని అనుబంధ శాఖల అధికారులు పల్లెల్లో కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సి ఉంది. కానీ ఎక్కడా అధికారులు పూర్తిస్థాయిలో పాల్గొనలేకపోతున్నారు. మండల స్థాయి అధికారులు ఒకరిద్దరు మినహా మిగిలిన అధికారులు ఈ కార్యక్రమానికి డుమ్మా కొడుతున్నారు. రైతులు కూడా అరకొర మందే పాల్గొంటున్నారు. దీంతో నూతన వ్యవసాయ సాంకేతిక సలహాలు, సూచనలు, తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి, సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం వంటివి అన్నదాతలకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం జరుగుతోంది. మరోవైపు పొలం బడుల నిర్వహణ సంఖ్యను కుదించడంతో బాటు నిధులు కేటాయింపు తగ్గడం వంటి కారణాల వల్ల 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి అంతగా స్పందన కనిపించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇవిఎంల గోడౌన్‌కు పటిష్ట భద్రత

ప్రజాశక్తి-కాకినాడ

ఇవిఎం, వివి.ప్యాట్‌లకు పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం గోదామును శుక్రవారం ఎన్నికల కమిషన్ అసిస్టెంట్ రిజిఓ పి.తాతబ్బాయి, రెవెన్యూ, ఎన్నికలు, పోలీస్ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి.జితేంద్ర, ఎన్నికల డిటి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.



గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

ఇద్దరు రత్నగిరి ఉద్యోగుల సస్పెన్షన్

ఐదుగురికి నోటీసులు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం దేవస్థానంలో పలువురు ఉద్యోగులపై దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇద్దరిని సస్పెండ్ చేయడగా, నలుగురు ఉద్యోగులకు ఛార్జి మెమోలు, ఒకరికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. కనకదుర్గ మ్యాన్ పవర్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ఇపిఎఫ్ నిధులు కట్టకుండా కట్టినట్టు ఫేక్ చలానాల సంఘటనలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, గుమస్తా రామకష్ణను సస్పెండ్ చేయగా పర్యవేక్షణాధికారి బలువు వాసుకు ఛార్జి మెమో ఇవ్వగా, జిఎస్‌టి వసూళ్లలో అలసత్వం వహించిన పర్యవేక్షణాధికారి కిషోర్, సీనియర్ అసిస్టెంట్ ఓలేటి జగన్నాథంకు ఛార్జి మెమోలు, రికార్డ్ అసిస్టెంట్ రమేష్, సూపరింటెండెంట్ రమణకు షోకాజ్ నోటీసులు అందజేసినట్టు సంబంధిత అధికారులు తెలిపారు.

ఆయిల్‌పామ్ రైతులను ఆదుకుంటాం..

ప్రజాశక్తి-గండేపల్లి

ఆయిల్‌పామ్ రైతులను అన్ని విదాలా ఆదుకుంటామని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మురారి గ్రామంలో ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పామాయిల్ తోటల విస్తరణ ఉత్సవంలో ఎంఎల్‌ఎ నెహ్రూ పాల్గొని మాట్లాడారు. ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించాయి. రైతులకు ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. పామాయిల్ పంట దేశానికి అవసరమైనదే కాక రైతులకు స్థిర ఆదాయం ఇచ్చే పంటగా నిలుస్తోందన్నారు. పతంజలి ప్లాంటేషన్ విభాగాధిపతి వి.పట్టాభిరామి రెడ్డి, జివి.వరప్రసాద్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.విజయలక్ష్మి మాటాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, కోర్పు లచ్చయ్య దొర, ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, వైస్ ఎంపిపి కుంచే రాజా, సీనియర్ నేతలు మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ కుమార్, ఎస్.రాజు పాల్గొన్నారు.



పామాయిల్ మొక్కలు నాటుతున్న ఎంఎల్‌ఎ నెహ్రూ

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నీకి భారీ విరాళం

ప్రజాశక్తి-కాకినాడ

ఆగస్టు నెలలో కాకినాడ క్రీడా మైదానం వేదికగా జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్ షిప్, ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహిణకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సిఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలు, కాకినాడ ఆదిత్య విద్యాసంస్థలు రూ.4 లక్షలు అందజేశాయి. ఈ మేరకు శుక్రవారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ జిఎం అడ్మిన్ ఎ.శ్రీనివాసు, సిఎస్ఆర్ జిఎం డి.సుధాకర్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులు సుగుణారెడ్డి, శృతి రెడ్డి జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కు చెక్కులను అందజేశారు. కాకినాడలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నమెంట్‌ల నిర్వహణకు సహకరించినందుకు అరబిందో ఫార్మా ఫౌండేషన్, ఆదిత్య విద్యాసంస్థల ప్రతినిధులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు

28న వికాస కార్యాలయంలో జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస ఆధ్వర్యంలో ఈ నెల 28న సోమవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎయు స్మాల్‌ఫైనాన్స్ బ్యాంక్ సెంటర్ మేనేజర్, ఇఆర్ (ఫీల్డ్ కలెక్షన్), ఎస్‌డివివిఎల్ సర్వే అండ్ కనస్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్‌లో డిజైనింగ్ ఇంజనీర్, డిఇఎంఒ, సర్వే ఇంజనీర్, సైట్ ఇంజనీర్, హెచ్ఆర్, డబ్ల్యు బియాండ్‌లో టెక్నిషియన్, ఐసాన్ ఎక్స్పీరియన్సెస్ కంపెనీలో టెలి సేల్స్ రిప్రెజంటేటివ్, వియాష్ లైఫ్ సైన్సెస్, జె.కె. ఫిన్నర్లో టెక్నిషియన్, ఫాక్స్‌కాన్ కంపెనీలో ఆపరేటర్, ఇసుజు మోటార్స్, హ్యుండాయ్ మోబీస్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లొమో, బి.టెక్, ఎంబిఎ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 28వ తేదీ సోమవారం వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరుకావలన్నారు. మరిన్ని వివరాలకు 7799376222లో లేదా www.vikasajobs.comలో సంప్రదించాలని వికాస పీడీ ఆ ప్రకటనలో తెలిపారు.



అచ్యుతానందన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ సిఎం అచ్యుతానందన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-తాళ్లరేవు


ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు కేరళ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విఎస్.అచ్యుతానందన్ మృతికి ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, చల్లా సంతోష్ కుమార్, దడాల వెంకటేశ్వర్లు, అత్తిలి బాబూరావు, వల్లు చిన్న, మందపల్లి వేణు, చీకట్ల సూరిబాబు, సిహెచ్.చిన సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికులకు రిజిస్ట్రేషన్ కేంద్రం

ప్రజాశక్తి-పిఠాపురం

అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు పిఠాపురం కోర్టుల ప్రాంగణంలో శనివారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగనున్నట్లు 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి తెలిపారు. కోర్టు హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు రూపొందించిన అసంఘటిత కార్మికుల పథకం అమలుకు స్థానిక కోర్టుల ఆవరణలో లేబర్ ఆఫీసర్ ఏర్పాటు చేస్తున్న రిజిస్ట్రేషన్ కేంద్రం నందు నియోజవర్గంలో గల అసంఘటిత కార్మికులందరూ వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



వ్యభిచారాన్ని పూర్తిగా రూపు మాపాలి

ప్రజాశక్తి- పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలో వ్యభిచారాన్ని పూర్తిస్థాయిలో రూపుమాపాలని, చారిత్రక పెద్దాపురం గౌరవాన్ని కాపాడాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడారు. బాధిత మహిళ రిపోర్టు చేసిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. వ్యభిచార వృత్తి నిర్మూలనపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జోష్యుల కృష్ణబాబు మాట్లాడుతూ పెద్దాపురం పట్టణం ఎంతో చారిత్రక ప్రాముఖ్యత కలిగి విలసిల్లుతుందన్నారు. పట్టణం ప్రాముఖ్యతను నిలబెట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఇటువంటి సంఘటనలను పూర్తిగా అరికట్టవలసిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. వ్యభిచార వత్తిలో ఉన్న వారికి ప్రభుత్వమే ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. వ్యభిచార గహాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, కో ఆప్షన్ సభ్యులు మొహమ్మద్ రఫీ, బళ్లమూడి సూర్యనారాయణ మూర్తి, ఎండి ఆశిక్ ఆలీ, పెద్దిరెడ్డి నరేష్, కోరుకొండ ప్రశాంత్, దేవత రాజేష్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు దాడి బేబీ, గడిగట్ల సత్తిబాబు, సిరపరపు శ్రీనివాస్, గూనూరు వెంకటరమణ, వడ్డి శ్రీనివాస్, చింతల సత్యనారాయణ, బర్ల సతీష్, తైనాల శ్రీను, ప్రజా నాట్యమండలి నాయకులు దారపురెడ్డి కృష్ణ, చల్లా విశ్వనాథం తదితరులు ప్రసంగించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న వైస్ చైర్మన్ సాయి ప్రసాద్

ఏలేరు ఆయకట్టులో రెండు పంటలకు నీరు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఏలేరు కాలువలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి రాబోయే రోజుల్లో రెండు పంటలకు నీరు అందిస్తామని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రు తెలిపారు. శుక్రవారం మండలంలోని రామవరం వద్ద పురుషోత్తపట్నం ఫేజ్ టు పంప్ హౌస్ నుండి నీటిని ఆయన ప్రత్తిపాడు ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావుతో కలిసి ఏలేరు రిజర్వాయర్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఏలేరు రిజర్వాయర్ ప్రస్తుతం పది టిఎంసి నీరు మాత్రమే ఉందని, దీనివల్ల రాబోయే రోజుల్లో ఆయకట్టు రైతులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, వైస్ చైర్మన్ ఊట ఆది విష్ణు, దాట్ల కృష్ణ వర్మ, ఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, అడబాల వెంకటేశ్వరరావు, వీరంరెడ్డి కాశిబాబు, నీలం శ్రీను, కుర్ల చినబాబు, డిఇ ప్రసాద రావు, ఎఇ ఎస్.ఉమాదేవి పాల్గొన్నారు.



పంపు హౌస్ స్విచ్ ఆన్ చేస్తున్న ప్రత్తిపాడు ఎమ్ ఎల్ ఏ సత్యప్రభ

కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి

ప్రజాశక్తి-కాజులూరు, పెద్దాపురం

కూటమి ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తితో ఉన్నారని టిడిపి మండల అధ్యక్షుడు చవ్వాకుల నారాయణమూర్తి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కాజులూరులో ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలివెల రాజు, వెలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, బొడ్డు వీరకృష్ణ, కన్వీనర్లు బొండాడ వీర మణికంఠ, యాళ్ల దొరబాబు, యాళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెద్దాపురం కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ పురోభివృద్ధి సాధిస్తోందని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 27, 28, 29 వార్డుల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజా సూరిబాబు రాజు, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, కొరుపూరి రాజు, గడ్డం పెదకాపు, చందు, నూనె రామారావు పాల్గొన్నారు.



పెద్దాపురంలో తొలి అడుగు కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిన్నెరవీణ

సంతానం లేని దంపతులకు ఐవిఎఫ్ వరం

ప్రజాశక్తి-కాకినాడ

సంతానం లేని దంపతులకు ఐవిఎఫ్ ఒక వరం అని ప్రముఖ ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ కిన్నెర వీణ తెలిపారు. ప్రపంచ ఐవిఎఫ్ డే సందర్భంగా స్థానిక మెడ్వే సంజీవిని ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో మొదటి టెస్ట్ ట్యూబ్ బేబీ పుట్టినరోజు సందర్భంగా జూలై 24న ప్రపంచ ఐవిఎఫ్‌డేగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఫెర్టిలిటీ సమస్యలు సాధారణం అయ్యాయని, సరైన సమయంలో వైద్యం తీసుకుంటే తల్లిదండ్రుల కల నెరవేరడం పూర్తిగా సాధ్యమేనని తెలిపారు. తాము దంపతులకు ప్రత్యేకంగా ప్రణాళిక తయారు చేసి, వారికి అనుగుణంగా చికిత్స అందిస్తున్నామన్నారు. పురుషులలో స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండడం, మహిళలలో ట్యూబ్స్ బ్లాక్ అవడం, వయసు 35 సంవత్సరాలు దాటడం, ఎగ్స్ కౌంట్ తక్కువగా ఉండడం తదితర చాలా కారణాల వల్ల ప్రస్తుత సమాజంలో చాలామంది భార్యాభర్తలు సంతానం కలగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐవిఎఫ్ అనే సాధారణ ప్రక్రియ వల్ల సంతానాన్ని పొందవచ్చన్నారు. సెంటర్ హెడ్ డాక్టర్ దినేష్ కుమార్, డాక్టర్ సందీప్ మాట్లాడారు.

ఎస్ఐ శివ నాగబాబుకు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి-గండేపల్లి

గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఎస్‌పి బిందు మాధవ్ అభినందించారు. శుక్రవారం ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఎస్ఐ శివ నాగబాబును అభినందిస్తూ ఎస్‌పి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఎస్ఐ బాధితుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రతి ఫిర్యాదుదారునితో మాట్లాడి సమస్య పరిష్కారం జరగకపోతే వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఈ నెల 5న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా గండేపల్లి పోలీస్ స్టేషన్‌లోని 116 కేసుల పరిష్కారానికి ఆయన కృషి చేయడంతో జిల్లాలో గండేపల్లి ప్రథమంగా నిలిచింది.



అవార్డు అందుకుంటున్న ఎస్ఐ

రాస్తారోకోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు

మండల కేంద్రమైన కాజులూరులో శనివారం నిర్వహించే రాస్తారోకోను విజయవంతం చేయాలని జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన కాజులూరులో స్థానికులతో మాట్లాడుతూ ఐదేళ్లుగా మండలంలోని ప్రధాన రహదారి గొల్లపాలెం, కుయ్యేరు, లింక్ రోడ్లు, అంద్రంగి డ్రెన్‌పై వంతెన, చేదువాడ వంతెనలు పూర్తిగా శిథిలమైనప్పటికీ మండల కేంద్రమైన కాజులూరు, పరిసర గ్రామాల నుంచి జిల్లా కేంద్రమైన కాకినాడ, నియోజకవర్గం కేంద్రమైన రామచంద్రపురంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడి ఒక్కొక్కసారి ప్రమాదాలకు గురై ఆసుపత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంఎల్‌ఎ, మంత్రులు దృష్టి సారించకపోవడంతో కృష్ణుని గుడి వద్ద 10 గంటలకు ధర్నా నిర్వహిస్తున్నామని, ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కోటనందూరు

మండలంలో పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు సిఐటియు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం మండల మహాసభ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు కార్యదర్శులుగా టి.ముసలయ్య, అయినవిల్లి శేఖర్‌తో పాటు పదిమందిని ఎన్నుకున్నట్టు పద్మ తెలిపారు. గుండుకపల్లి మరినయ్య, కాపారపు నూకరాజు, కాపారపు లాజరు, ఎం.శ్రీను, శివచలం, కన్నారావు, పిల్లి సత్తిబాబు, మహాలక్ష్మి, సత్తిబాబు, దేవుడు, నూకరాజు, కృష్ణ పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

సమాజంలో కళాకారులును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైసిపి మండల కన్వీనర్ రామిశెట్టి నాని అన్నారు. శ్రావణ మాసాన్ని పరిస్కరించుకుని ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఏలూరు గ్రామానికి చెందిన కళాకారుడు సత్యంశెట్టి అమ్మన్నను మండల కన్వీనర్ రామిశెట్టి నాని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపూడి శేషు, గోళ్ళ తేజ, కరుసూదుల శేఖర్, సత్యంశెట్టి సాయి చరణ్, కోలా వెంకటేశ్వరావు, బర్రె బుల్లికాపు, చీకట్ల తాతీలు పాల్గొన్నారు.

ధ్యానంతో ఒత్తిడి లేని జీవనం

ప్రజాశక్తి-తుని

ఒత్తిడి లేని జీవనానికి ధ్యానం అవసరమని యోగద సత్సంగ సొసైటీ అఫ్ ఇండియా ఉపాధ్యక్షులు స్వామి శ్రీ స్మరణానంద గిరి తెలిపారు. శుక్రవారం తుని శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో ఆయన నందు విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనపై ఏకాగ్రతకు ధ్యానం ఒక మార్గమని అయన సూచించారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లరేవు

వర్షపు నీటితో ముంపునకు గురైన వ్యవసాయ ప్రాంతాలను డ్రైనేజీ ఎఇ పాలెపు వీరబాబు శుక్రవారం పరిశీలించారు. తాళ్లరేవులో నారుమళ్ల ముంపుతో రైతుల ఆందోళన అని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. చెరువుగట్టు సెంటర్, తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న డ్రైనేజీని ఆయన ఇరిగేషన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలోని మురుగు కాలువ నాన్ నోటిఫైడ్ డ్రైన్ అన్నారు. ఇది రెవెన్యూ డ్రైన్‌గా గుర్తించినట్లు తెలిపారు. తాళ్ళరేవు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వ్యర్థ జలాలు ఈ డ్రైన్ ద్వారా ఆత్రేయ పాయలో కలుస్తున్నాయని తెలిపారు. అత్యవసరంగా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ శాఖ డివిజనల్ ఎఇ ద్వారా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. రూ.లక్ష నిధుల అంచనాతో ప్రతిపాదనలు పంపుతున్నట్టు తెలిపారు. మండలంలో గుర్తించిన డ్రైనేజీలలో గుర్రపు డెక్క తొలగిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది సాయి, సిద్దు పాల్గొన్నారు.



చెత్తతో నిండిన డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎఇ, డిఇ వీరబాబు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక వ్యక్తిని పోలీసులు అదుపులో తీసుకుని అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం. మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద గంజాయి ఉందన్న విశ్వనీయ సమాచార మేరకు ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో శుక్రవారం దాడులు నిర్వహించారు. అతని వద్ద నుంచి 470 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

తడి పొడి చెత్తను కలిపి వేయకుండా వేరువేరుగా సేకరించాలని ఇఒపిఆర్డి వి.సాగర్ కుమార్ తెలిపారు. మండలంలోని చేబ్రోలులో తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి చెత్తలో వంటగది వ్యర్థాలు, ఆకుకూరలు, ఇతర కాలిపోయే పదార్థాలు, పొడి చెత్తలో కాగితం, ప్లాస్టిక్, గాజు లోహాలు వంటివి వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు.

పలుచోట్ల మలేరియా మాసోత్సవాలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చినజగ్గంపేట, గొల్లపేట ఏరియాలో గొల్లప్రోలు పిహెచ్సి ఆధ్వర్యంలో డెంగీ మలేరియా జ్వరాల నివారణకు చర్యలు చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పాడైపోయిన కూలర్స్, రిఫ్రిజిరేటర్స్ బ్యాక్ వాటర్, కొబ్బరి బొండాలు, టైర్స్, జాడీలు, ఫ్లవర్ వాజులు, వాటర్ డ్రమ్ములు, నీటి తొట్టెలు, మూతలు లేని నీటి డబ్బాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అహ్మద్ బాషా, రాజీవ్ భీమ్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యదేవుని 135వ ఆవిర్భావ వేడుకలు కొండపై ఘనంగా ప్రారంభమయ్యాయి శుక్రవారం వేకువ జామున అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనివేటి మండపంలో ఇఒ వీర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవి.రోహిత్ ఆధ్వర్యంలో అర్చకులు వేద పండితులు పూజలు నిర్వహించారు. ఈ వైదిక పూజలు నిర్వహించిన అర్చక స్వాములకు ఇఒ, చైర్మన్ నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం అంతా ప్రత్యేకంగా అలంకరించారు.

రాజారావు ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

చాగంటి రాజారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్టాలిన్ భవన్ వద్ద రాజారావు 4వ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుతగా స్టాలిన్ భవన్ నుండి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు అరుణోదయ కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు రాజారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వి.చిట్టిబాబు, ఎస్.లక్ష్మి, పి.విజయ, కె.బాబూరావు, ఎన్.వరద రాజు, కారుకొండ శ్రీను, మొరుకుర్తి రాజు, ధర్మారెడ్డి, సుగ్గిరెడ్డి, వి.మయూరి పాల్గొన్నారు.

ఆదిత్యలో అప్లయిడ్ రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి-గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ ఇనోవేటివ్ మేకర్స్ అండ్ ఇంజినీయర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు అప్లైడ్ రోబోటిక్స్ బ్యాటిల్ బాట్ ఎడిషన్ వర్క్‌షాప్ నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ వర్క్‌షాప్‌నకు బెంగళూరు నుంచి ప్రొఫెసర్ అరుబింద మహారాణా ప్రాధాన వక్తగా హాజరై, రోబోటిక్స్ రంగంలో బాట్ డిజైన్, కంట్రోల్ సిస్టమ్స్, బ్యాటిల్ బాట్ పోటీల కోసం అవసరమైన సాంకేతిక విషయాలను వివరిస్తూ మార్గదర్శనం చేశారు. ప్రాక్టికల్ సెషన్‌లు, లైవ్ డెమోన్స్ట్రేషన్లు, టీమ్ ఆధారిత ప్రాజెక్టులతో మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులు రోబోటిక్స్ అంశాలను అనుభవపూర్వకంగా తెలుసుకునే అవకాశం పొందారు. ఈ కార్యక్రమంలో విసి డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, స్టూడెంట్ ఎఫైర్స్ విభాగం డీన్. డాక్టర్ డి.కిషోర్ పాల్గొన్నారు.

మరిడమ్మను దర్శించుకున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందరకు పంపిణీ చేశారు. స్థానిక మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం ఆర్‌డిఒ శ్రీరమణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కే విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం వేద పండితుల వేదాశీర్వచనాలతో ఆమెకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, రామచంద్ర ప్రసాద్, సిబ్బంది ఎస్.రమణ, వరహాలు, శివ, క్రాంతి పాల్గొన్నారు.

సిఐ, ఎస్ఐలకు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట సిఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునాథరావునుప ఎస్‌పి బిందు మాధవ్ అభినందించారు. ఈ నెల 5న నిర్వహించిన మెగా జాతీయ లోక్ అదాలత్‌లో 116 కేసులను పరిష్కరించి జిల్లాలో జగ్గంపేటను ప్రథమ స్థానంలో నిలిపినందుకు శుక్రవారం వారికి ప్రశంసా పత్రాలు అందించారు.

మున్సిపల్ కుళాయిల్లో బురద నీరు

ప్రజాశక్తి- సామర్లకోట

మున్సిపల్ కుళాయిల నుంచి వస్తున్న నీరు బురదమయంగా ఉండడంతో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 14వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నేతల హరిబాబు పేర్కొన్నారు. బలుసులపేట పరిసర ప్రాంతాలకు మున్సిపల్ కుళాయిల నుంచి రెండు రోజులుగా బురద నీరు వస్తోందన్నారు. ఈ ప్రాంతాల్లో దాదాపు ప్రజలంతా తాగునీటి కోసం మున్సిపల్ కుళాయిలపైనే ఆధారపడతారని, కుళాయిల నుంచి బురద నీరు వస్తుండడంతో తాగడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. బురద నీరు తాగలేక చాలామంది సమీపంలోని ఆర్ఓ ప్లాంట్లలో తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నారని తెలిపారు.

యానాం వార్తలు



గెలుపొందిన వారితో వ్యాయామ ఉపాధ్యాయులు

ఉత్సాహంగా బాస్కెట్ బాల్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో జోనల్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం బాస్కెట్ బాల్ పోటీ ఉత్సాహంగా నిర్వహించారు. దానిలో అండర్ 17 బాయ్స్ బాస్కెట్ బాల్ పోటీలలో రీజెన్సీ జూనియర్ కళాశాల ప్రథమ స్థానం సాధించగా ద్వితీయ స్థానంలో సాయి జూనియర్ కాలేజ్, తతీయ స్థానంలో రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నిలిచాయి. గెలుపొందిన వారికి వ్యాయామ ఉపాధ్యాయులు ఐవికె మోహన్,వడ్డి వరప్రసాద్, కె.రమేష్, వి.సన్యాసిరావు, కె.భాస్కర్, సిహెచ్.వెంకటేశ్వరరావు, సోమేశ్ కిరణ్మయి బహుమతులు ప్రధానం చేశారు.

బాణసంచా లైసెన్సుల జారీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - యానాం

అక్టోబరు 20న దీపావళి పండగ నేపథ్యంలో బాణసంచా దుకాణాల ఏర్పాటు కోసం ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పుదుచ్చేరి జిల్లా మేజిస్ట్రేట్ కుళోత్తుంగన్ తెలిపారు. దరఖాస్తులను ఆగస్టు 21లోగా పంపించాలన్నారు. పేలుడు చట్టం నిబంధనల మేరకు నివేదికను సమర్పించాల్సి ఉంటుందన్నారు.



దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పురుగు మందు దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పురుగుమందుల దుకాణంపై శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదేశాలతో పట్టణంలోని రంగప్ప చెరువు వద్ద ఉన్న హనుమాన్ ట్రేడర్స్ పురుగు మందుల దుకాణంపై పిఠాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.స్వాతి, వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో షాపులో ఉన్న నిల్వలకు స్టాక్ రిజిస్టర్‌లో రూ.1,13,625 స్టాకుతేడా వచ్చిందని స్టాక్ సీజ్ చేసి కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు.

సిఎం, డిసిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి-పెద్దాపురం

మంచి పనిని గుర్తించి అభినందనలు తెలపడం చాలా సంతోషదాయకమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు శుక్రవారం స్థానిక పాండవులు మెట్ట దగ్గర ఉన్న లారీ యూనియన్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు లారీ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన పాలాభిషేకంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని ప్రజల్లో మంచి పేరు తీసుకువచ్చిందన్నారు.

303 మంది హెచ్ఐవి బాధితులకు వ్యాక్సిన్‌లు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న లింకు ఆర్ట్ ప్లస్ సెంటర్‌లో సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.ఉమా మహేశ్వరి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐవికి మందులు వాడుతున్న 303 మందికి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రత్నమణి, బాలాజీ, డిసి బుజ్జిబాబు, ప్రసాద్ బి.శ్రీనివాసరావు, చంద్రమౌళి, జ్యోతి, శ్రీనుబాబు, మహాలక్ష్మి, రోజా, వసంత పాల్గొన్నారు.



గోతిలో పడి గాయపడిన మహిళ

ప్రత్తిపాడు జంక్షన్‌లో పొంచి ఉన్న ముప్ప

ప్రజాశక్తి- సామర్లకోట

వర్షపు నీటితో నిండిన గోతులతో ప్రజలకు తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. సామర్లకోట సిబిఎం సెంటర్ ప్రత్తిపాడు జంక్షన్ సమీపంలో కల్వర్టుకు అటు ఇటు గోతులు ఏర్పడటంతో వర్షం కురిసిన ప్రతి సమయంలో ఆ ప్రాంతం ప్రమాద భరితంగా మారుతోంది. ఆవిధంగానే శుక్రవారం సుమారు 10 మందికి పైగా బైక్‌పై వస్తూ నీటితో నిండిఉన్న గోతుల్లో పడిపోవడంతో తీవ్రగాయాల పాలయ్యారు. ఆ ప్రాంతంలో ఉన్న యువకుల సాయంతో గాయపడిన పలువురిని ఆసుపత్రికి తరలించారు. కొద్దిపాటి వర్షం వస్తే చాలు ఈ గోతులు నీటితో నిండి కనిపించక పోవడంతో అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రమాదాల నుంచి కాపాడాలని కోరుతున్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలానికి చెందిన పలువురు వైసిపి ముస్లిం కార్యకర్తలు శుక్రవారం టిడిపిలో చేరారు. వారికి స్థానికటిడిపి కార్యాలయం వద్ద ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గాజింగం సత్తిబాబు, మారిశెట్టి భద్రం, పిల్ల చంటిబాబు, ఎస్.బాబు, ఆచంట రాజు, పోసిన ప్రసాద్, పైలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఒగా జి.వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-పిఠాపురం



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌హెచ్‌ఒ జి.వెంకటలక్ష్మి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పిఠాపురం ఎస్‌హెచ్‌ఒగా జి.వెంకటలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో జంగారెడ్డిగూడెం, భీమడోలు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించి ఉద్యోగోన్నతిపై పిఠాపురం బదిలీపై వచ్చారు. సారాయి తయారీ, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వాటి నిర్మూలనకు కృషి చేస్తానన్నారు. సారాయి తయారీ, అమ్మకం దారులపై పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు.

మడ అడవుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కాకినాడ

అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిసిఫ్ ఇసిఆర్‌సిసి ఎపి అటవీశాఖ సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం కాకినాడ సాలిపేటలోని పిఎస్ మున్సిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించారు. మడ అడవులు తీర ప్రాంత జీవవైవిధ్యానికి రక్షక వృక్షాలుగా నిలుస్తాయని, కాకినాడకు గర్వకారణమైన కోరింగ మడ అడవి ప్రాధాన్యం, పర్యావరణ సమతుల్యతకు వాటి పాత్ర వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. జిల్లా సమన్వయకర్త ఎల్.శ్రీహర్ష, హెచ్‌ఎం ఎ.పుష్పగిరి, కె.మహేష్, నేషనల్ గ్రీన్‌కోర్ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలనను ప్రశ్నించాలి

ప్రజాశక్తి-తుని



సమావేశంలో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

రాష్ట్రంలో అరాచక పాలనను మేధావులు, విద్యావంతులు ప్రశ్నించాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శుక్రవారం తుని పట్టణం ఫంక్షన్ హాల్లో నాయకులు కార్యకర్తలతో విస్తతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిస్థాయిలో విఫలమైందని దీనికి పూర్తి బాధ్యత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వహించాలన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే నినాదంతో వైసిపి కార్యకర్తలతో ప్రతి గడపగడపకు వెళ్లి జగన్ పాలనకు, కూటమి ప్రభుత్వ పాలనుకున్న తేడాను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యనమల కృష్ణుడు, పోతల లక్ష్మణ్, సూడిశెట్టి సత్యనారాయణ, పోతల రమణ, లంక కృపానందం పాల్గొన్నారు.



దళిత యువకునిపై దాడిని ఖండిస్తున్న నాయకులు

దళిత యువకునిపై దాడికి ఖండన

ప్రజాశక్తి- తాళ్లరేవు

అయినవిల్లి మండలానికి చెందిన దళిత యువకుడు దోనిపాటి మహేష్‌పై జరిగిన దాడిని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. స్థానిక అంబేద్కర్ భవనం వద్ద అసోసియేషన్ నాయకులు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దోషులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కన్నీడి వెంకటరమణ, కుసుమ శ్రీనివాస్, కమిడి ఈశ్వరీబాయి, రొక్కం లోవరాజు, విప్పర్తి శ్రీనివాస్, దుప్పి అదృష్టదీపుడు, నల్లి ఈశ్వరరావు, ఎలిపే నాగేశ్వరరావు, పెనుమ్మ బాబా పాల్గొన్నారు.



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆదిత్యలో ఎనేబుల్‌మెంట్ ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు సారథ్యంలో స్టూడెంట్ ఎనేబుల్‌మెంట్ ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రోగ్రాంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డుకి విశేష సేవలు అందిస్తున్న మీనాక్షి వ్యాస్, లలిత భంగారే ఆన్‌లైన్‌లో రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జూలై 21వ తేదీ నుండి 25వ తేదీ వరకు 5 రోజులు మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, డిపార్ట్మెంట్ అధ్యాపకులు పాల్గొన్నారు.

నిలకడగా ముద్రగడ ఆరోగ్యం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

తన తండ్రి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన పెద్ద కుమారుడు ముద్రగడ వీర్రాఘవరావు తెలిపారు. తన తండ్రి ఆరోగ్యంపై మాజీ సిఎం వైఎస్.జగన్ ఎప్పటికప్పుడు ఆరోగ్య క్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారని, యశోద వైద్యులతో ముద్రగడ ఆరోగ్యం గురించి ఆరా తీస్తున్నారని తెలిపారు. వైఎస్.జగన్‌కు, తమకు అండగా ఉన్న ప్రజలకు ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు.